## 16 నుండి 19 వరకు టీటీడీలో వస్త్రాల ఈ - వేలం

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:** తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఆగష్టు 16 నుండి 19వ తేదీ వరకు ఈ- వేలం వేయనున్నట్లు సోమవారం టిటిడి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈవేలంలో కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 194 లాట్లు ఉన్నాయి. ఇందులో పాలిస్టర్, కాటన్ పంచలు, క్లాత్ బిట్స్, హుండీ గల్లేబులు, పవిత్రాలు, బ్లౌజ్‌పీస్‌లు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, శాలువలు, బెడ్‌షీట్లు, దిండుకవర్లు, పంజాబి డ్రెస్ మెటీరియల్స్, జంకాళం కార్పెట్లు, దుప్పట్లు, కర్టన్లు, గర్భగృహ కురాళాలు, బంగారువాకిలి పరదాలు, కాకి పరదాలు ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877- 2264429 నంబరులో గానీ, టీటీడీ వెబ్‌సైట్ సంప్రదించగలరు.

### అంగరంగ వైభవంగా

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబరు 18 నుండి 26 వరకు సాలకట్ల ఉత్సవాలు
- అక్టోబర్ 15 నుండి 23 వరకు నవరాత్రి కార్యక్రమాలు
- పురటాసి మాసం సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 17 వరకు
- భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు : టీటీడీ ఈవో

శ్రీవారి బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఈవో ధర్మారెడ్డి

**ప్రజాశక్తి- తిరుమల:** అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో, పురటాసి మాసం కూడా వస్తున్నందువల్ల భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి చెప్పారు. అన్ని విభాగాల అధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మంలతో కలిసి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులతో సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఒకటిన్నర నెల ముందుగానే ప్రారంభించినట్లు చెప్పారు. 15 రోజుల తరువాత, జిల్లా యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రోజుల్లో సెప్టెంబర్ 18న ధ్వజారోహణం ఉంటుందని, అదే రోజు రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ముఖ్యమైన రోజుల్లో 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం, ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. అదేవిధంగా నవరాత్రి బ్రహోత్సవాలు అక్టోబర్ 15న ప్రారంభమై 19న గరుడవాహనం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానంతో వస్తాయని చెప్పారు. ఇంజినీరింగ్ పనులు, అన్నప్రసాదం, దర్శనం, వసతి, పోలీసు, కళ్యాణకట్ట, రవాణా, హెచ్‌డిపిపి, ఉద్యానవనం, వైద్యం, ఆరోగ్యం, శ్రీవారి సేవకుల సమన్వయంతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించినట్లు ఈవో తెలిపారు. పురటాసి మాసం, రెండు బ్రహ్మోత్సవాలు కలిసినందున, ఈ సంవత్సరం భారీ యాత్రికుల రద్దీని అంచనా వేస్తున్నామని ఈవో చెప్పారు. పురటాసి పవిత్ర మాసం సెప్టెంబర్ 18న ప్రారంభమై అక్టోబరు 17నముగుస్తుందన్నారు. సెప్టెంబరు 23, 30, అక్టోబర్ 7, 14 తేదీల్లో పురటాసి శనివారాలు జరుగుతాయని, ఈరెండు బ్రహ్మోత్సవాలు, పురటాసి శనివారాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. ఎఫ్‌ఎసిఎవో బాలాజీ , డిఎల్వో వీర్రాజు, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, తిరుమల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# స్త్రీ సమానత్వం కోసం ప్రతిఘటన తప్పదు

- అరికట్టడం చేతకాకపోతే అధికారం నుంచి దిగిపో..!
- మోదీకి ఐద్వా హెచ్చరిక
- జిల్లాలో పర్యటించిన రాష్ట్రజాత

తిరుపతిలో..

**ప్రజాశక్తి- తిరుపతి సిటి:** దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అత్యాచారాలు, దాడులు, హింస రోజురోజుకు పెరిగిపోతుందని, వాటిని అరికట్టడం చేతకాకపోతే ప్రధాని నరేంద్రమోదీ అధికారం నుంచి దిగిపోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ హెచ్చరించారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని హింసపై మహిళల పోరుయాత్ర పేరుతో ఐద్వా రాష్ట్ర జాతను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈనెల 29న సత్యసాయి జిల్లాలో ప్రారంభమైన ఈజాత అన్నమయ్య, చిత్తూరు జిల్లా మీదగా సోమవారం తిరుపతి జిల్లాలోకి ప్రవేశించింది. స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద రాష్ట్రజాతకు ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, సాయిలక్ష్మీ స్వాగతం పలికారు. పూలేవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సావిత్రమ్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై హింస పెరిగుతోంది. చివరకు చిన్నారులను సైతం వదలడం లేదన్నారు. మనుషులందరూ సమానమే అనే విదానాన్ని పక్కనపెట్టి మనవాదం పేరుతో మహిళలపై పెత్తనం చేయాలని కుట్ర చేస్తోంది. మణిపూర్ ఘటన అత్యంత పాశవికం. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన మోదీ ప్రభుత్వం బాధితులను మరింత హింసిస్తూ, నిందితులను అక్కున చేర్చుకోవడం దారుణం. బేటి బచావో..దేశకా బచావో అంటున్న మాటలకు అర్థం ఇదేనా అని ప్రశ్నించారు. మణిపూర్ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్నది బిజెపి ప్రభుత్వాలే. మరి ఇంత దారుణం జరుగుతుంటే చోద్యం చూస్తాన్నాయా?, హింసను అరికట్టలేని మోదీకి అధికారం ఎందుకు దిగిపోవాలి. తన పదవికి రాజీనామా చేయాలని డిమాండు చేశారు. సినిమాల్లో, ఇతరాత్ర ప్రచారాల్లో ఇటీవల అశ్లీలత ఎక్కువైంది, వీటిని నియంత్రించాల్సిన సెన్సార్‌బోర్డు నిద్రపోతుందా అని ప్రశ్నించారు. మహిళలపై దాడులు చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుని, మహిళా చట్టాలను అమలు చేయాలని డిమాండు చేశారు. ఆగస్టు 8న విజయవాడ జింఖాన గ్రౌండ్‌లో ఐద్వా ఆధ్వర్యంలో జరిగే సదస్సులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ భరతమాతకు జే కొడుదాం, ఆమెను గౌరవిద్దాం, తాము సంస్కారవంతులు అని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, మహిళలపై జరుగుతున్న దాడులను, భరతమాత బిడ్డలైన మహిళలను నగ్నప్రదర్శనలు చేస్తుంటే ఎందుకు ఖండించడం లేదు, తమ ఆదేశాల మేరకే నడుస్తున్న నరేంద్రమోడి ప్రభుత్వాన్ని ఎందుకు కట్టడిచేయడం లేదని ప్రశ్నించారు. బహిరంగంగా మణిపూర్‌లో అందరి ఎదుట ఇద్దరు మహిళలను కొంత మంది ఉన్మాదులు నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేస్తే వారిపై చర్యలు తీసకుని, బాధితులకు న్యాయం చేయాల్సిన మోడి ప్రభుత్వం, నిందితులకు వంతు పాడుతూ బాధితులను విస్మరించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అవిశ్వాసాన్ని బలపరిచి, తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. మహిళల పట్ల తమ వైఖరిని వెల్లడించాలని డిమాండు చేశారు. ఆగస్టు 8న జరిగే సదస్సుల్లో మహిళలు, మహిళా శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని, మహిళల సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. మహిళపై జరుగతున్న హింసను తెలియజేసేలా యువత చేసిన నృత్యాలు అందర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం ఈ జాత రేణిగుంట, ఏర్పేడు,శ్రీకాళహస్తి, నాయుడుపేట మీదగా నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ జాతకు మహిళా సమైక్య నాయకులు జయలక్ష్మీ, మంజుల, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాళ్లు, తెలుగు మహిళా నాయకురాలు పుస్పావతి, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీసింగ్ హజరై మద్దతు తెలిపారు. ఐద్వా నెల్లూరు జిల్లా నాయకురాళ్లు మస్తానబీ, అరుణా, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, సిఐటియు నాయకులు జి.బాలసుబ్రమణ్యం, వేణు, మునిరాజా, సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, డివైఎఫ్ఐ నాయకులు జయచంద్ర, సుమన్, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు సి.బాస్కర్, రత్నమ్మ, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

**రేణిగుంట:** హింసలేని సమాజం కోసం చేయిచేయి కలుపుదాం అంటూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రజాతా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రేణిగుంట చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి విద్యార్థులకు మహిళలపై జరుగుతున్న దాడులను గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధన్, ఐద్వారాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, మస్తాన్‌బి, శివకుమారి, వి.జయలక్ష్మీ, జయంతి, సాయిలక్ష్మీ, లక్ష్మీ, రాజేశ్వరి, తదిరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

**బీజేపీ పాలనలో....మహిళలను చెరబడితే 'సంస్కారులే'..!!**

**శ్రీకాళహస్తి:** మతతత్వ బీజేపీ పాలనలో భరతమాత సామాన్యులైన మహిళలను చెరబట్టే వారు శిక్షార్హులు కాదనీ, వారిని సంస్కారులుగా సత్కరించి ఇంటికి పంపుతున్నారని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు, సంపద, రాజకీయ లబ్దికోసం బీజేపీ మతాలు, తెగల మధ్య అల్లర్లు సష్టిస్తోందని ఉద్ఘాటించారు. ఐద్వా చేపట్టిన హింసపై మహిళా పోరుయాత్ర సోమవారం శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఐద్వా సమావేశాన్ని నిర్వహించి సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయలను విశదీకరించారు. స్త్రీ సమానత్వం రావాలన్నా, మహిళలపై హింస తగ్గాలన్న మహిళలు ప్రతిఘటించక తప్పదని రమాదేవి అన్నారు. అనంతరం ఆమె మీడియాతో సంపద, ఆస్తులు, రాజకీయ లబ్ది కోసమే మణిపూర్ అల్లర్లు చెలరేగాయన్నారు. రెండు తెగల మధ్య విధ్వంసం సష్టించి మోడీ ప్రభుత్వం వేడుక చూస్తోందని మండిపడ్డారు. కుకీ తెగకు చెందిన ఇద్దరు మహిళలను వివస్త్రను చేసి, నగ్నంగా ఊరేగించి ఆపైన అత్యాచారం, హత్య చేస్తే డబుల్ ఇంజిన్ సర్కారైనబీజేపీ ప్రభుత్వం మూడు నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఐద్వా నాయకులు సావిత్రమ్మ, మస్తాన్ బి, శివకుమారి, సాయి లక్ష్మి, జయంతి, రాజేశ్వరి, కేశవమ్మ, పద్మావతి, సిఐటియు నాయకులు అంగిరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, జన విజ్ఞాన వేదిక నాయకులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

**నాయుడుపేట:** మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రజాతా సోమవారం సాయంత్రం నాయుడుపేటకు చేరుకుంది. రాష్ట్ర ఐద్వా ప్రధానకార్యదర్శి డి.రమాదేవి, సావిత్రి, సాయిలక్ష్మీ, జయంతి, రాజేశ్వరి, ప్రమీల, చంద్రకళ, శివకుమారి, ముకుందా పాల్గొన్నారు.

**గూడూరుటౌన్:** దేశంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని,ఈ దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. సోమవారం రాత్రి గూడూరు పట్టణంలోకి ఐద్వా ప్రచారజాత చేరుకొంది. పట్టణంలోని గడియారం స్థంభం వద్ద నున్న అంబేద్కర్ విగ్రహానికి ఐద్వా నాయకులు, స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీకాళహస్తిలో..

# కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలి

**ఆర్డీవోకి సిపిఎం, సిఐటియు వినతి**

సూళ్లూరుపేటలో..

**ప్రజాశక్తి- సూళ్లూరుపేట:** కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలని సిపిఎం, సిఐటియు నాయకులు ఆర్డీవో మునిచంద్రకు వినతిపత్రం సోమవారం సమర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి బి.పద్మనాభయ్య మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ స్థాపించడం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వరంగంలో లాభదాయకం కానీ ఈ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకమవుతుందో బిజెపి చెప్పాలని ప్రశ్నించారు. సెయిల్ అధ్యయనం చాటున తన చేతికి రక్తపుమరకు అంటకుండా కడప ఉక్కును రాయలసీమ యువత ఆశలను బిజెపి హత్యచేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారానికి పోటీపడుతున్న వైసిపి, టిడిపిలు పరిశ్రమను సాధించడంలో ఘోరంగా విఫలమైనారని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు కావాలని అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అంశాలను అమలుపరుస్తామని బిజెపి హామీ ఇచ్చింది. దానిని ఇప్పుడు తుంగలో తొక్కుతున్నది. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలో నిర్మించాలి కానీ బిజెపి మొదటి నుంచి ఈపరిశ్రమ స్థాపనపై మోసపూరిత వైఖరి అనుసరిస్తున్నది ఇప్పటికైనా బీజేపీ మోసపూరిత తనాన్ని ప్రతిపక్షపార్టీ అధికార పార్టీ ప్రశ్నించాలని, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణకార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు సుంకర అల్లెయ్య, సిఐటియు గౌరవాధ్యక్షులు కె.సాంబశివయ్య, అధ్యక్షకార్యదర్శులు డి.రమణయ్య,కె.లక్ష్మయ్య, ఎస్.కె.రియాజ్, భాస్కర్, రామయ్య, పళని, రమణయ్య, వెంకటరత్నం, శ్రీదేవి, చెంగమ్మ, రాజబాబు, విజయ పాల్గొన్నారు.

పుత్తూరులో..

**పుత్తూరు టౌన్:** ఉక్కు పరిశ్రమను కడపలో ఏర్పాటు చేయాలని కోరుతూ రాయలసీమ వ్యాప్తంగా ఆగస్టు ఒకటో తేదీన కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నను నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకటేష్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు ఏ.విజయ్, శివ, పురుషోత్తం, వెంకటేష్, సుధాకర్, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

గూడూరులో..

**గూడూరు:** గూడూరులోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఎం ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వాలే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఏఓకి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో గూడూరు సిపిఎం సెంటర్ శాఖకార్యదర్శి జోగి శివకుమార్, టి.వెంకటరామిరెడ్డి, ఎస్.సురేష్, బివి.రమణయ్య బి.గోపినాథ్, అడపాల ప్రసాద్, పామంజి మణి. బి.చంద్రయ్య, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

# 7న డిస్కం కార్యాలయం ముట్టడి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

**10 తర్వాత ఏ క్షణమైనా నిరవధిక సమ్మెకు**
**ఏపీ విద్యుత్ కార్మిక సంఘాల పోరాట కమిటీ**

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్మెంట్‌తో పిఆర్సీని అమలు చేయాలని, విద్యుత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ కోరుతూ దశల వారీ ఆందోళనా కార్యక్రమాలకు సన్నద్ధమవుతున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రకటించారు. సోమవారం ఏపీ విద్యుత్ ఉద్యోగుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో కందారపు మురళి ప్రసంగించారు. సిఐటియు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాతిక సంవత్సరాలుగా విద్యుత్ సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ విధానమే లేకుండా కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించి, ముఖ్యమంత్రిగా నాలుగున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. జేఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్‌లకు ప్రొబెషన్ డిక్లరేషన్ చేయాలని ఆయన కోరారు. మరణించిన వారి కుటుంబాల్లోని కుటుంబ సభ్యులకి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని, వారికి ఏపీఎస్ ఈబీ సర్వీసు రూల్స్ అమలు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుండి జిపిఎఫ్‌గా మార్పు చేసి పాత విధానంలోనే పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు, కార్మికులకు నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీనీ అమలు చేయుటకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ సంస్థలో గుర్తింపు కొరకు కార్మిక సంఘాలకు ఎన్నికలు జరపాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, పీస్ రేట్ పేరుతో పనిచేస్తున్న కార్మికుల దీనస్థితిని పట్టించుకోకపోతే తాము కోర్టుకు వెళ్లామని, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా అమలు చేయలేదని ఆరోపించారు. కోర్టు ధిక్కారం కేసులో ట్రాన్స్ కో సీఎండికి, ఏపీఎస్పీ డీసీఎల్ సిఎండి సంతోష్ రావులకు నెల రోజుల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన దశలవారీ ఉద్యమానికి సిఐటియు సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నదని ఆయన తెలిపారు. రీజినల్ కార్యదర్శి శివ ప్రసాద్ రెడ్డి, డిస్కం అధ్యక్షులు ఎన్. శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్థ పట్ల తగిన శ్రద్ధ చూపకపోగా, ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఏళ్లు గడుస్తున్నా పిఆర్సీని విద్యుత్తు ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయకపోవడం నేరమని అభివర్ణించారు. సమస్యలు చెప్పుకుందామంటే యాజమాన్యం వినేస్థితిలో లేదని ఆరోపించారు. విచ్చలవిడిగా బదిలీలు, నియామకాలు, ప్రమోషన్లు ఇస్తూ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని, చట్ట వ్యతిరేకంగా అధికారులు ప్రవర్తిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు, అవుట్సోర్సింగ్ కార్మికులు, పీస్‌రేట్ కార్మికులంటే యాజమాన్యానికి లెక్కలేనితనంగా తయారైందని విమర్శించారు. తెలంగాణా రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.41 వేలు వేతనం ఇస్తుండగా తమకు కేవలం రూ.20 వేలు చెల్లిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న పోరాటంలో పవర్ జేఏసీ కార్మికులకు ద్రోహం చేసిందని విమర్శించారు. విద్యుత్ కార్మికుల, ఉద్యోగుల పోరాట కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆగస్టు 7వ తేదీన ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట వేలాది మందితో ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్టు కుమార్ ప్రకటించారు. శ్రీహరి, కిరణ్, చిరంజీవి, సోము, గుణశేఖర్, మునికష్ణ, సి.భానుప్రకాష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి: ఎస్పీ

**ప్రజాశక్తి- తిరుపతిసిటీ:** స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజాసమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతిఒక్కరి కేసు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి, స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టిపరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ప్రజలు 87 ఫిర్యాదులు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని, సుదూరప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పీ కార్యాలయానికి రాలేని వద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్ల నందు పిర్యాదు చేయవచ్చున్నారు. వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించి, పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఏఎస్పి విమల కుమారి, డీఎస్పీలు, సీఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రపంచ శాంతి కోసం 3 నుంచి 9 వరకు తిరుపతిలో**

## 225 కుండియా మహాలక్ష్మి మహాయజ్ఞం

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** జగద్గురువులు రామానుజాచార్య శ్రీఝుల్రియపీఠాడపతి 1008 సన్నిధిలో శ్రీశ్రీశ్రీ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి, మానవాళి సంక్షేమం కోసం 225 కుండియా మహాయాగం, శ్రీమద్ భగవత్ కథాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీశ్రీధర్ మహోత్సవ సమితి సమన్వయకర్త డాక్టర్ నవీన్ మహేశ్వరి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్వామీజీ ఘన్‌షాయామా చార్యజీ మహారాజ్. తిరుపతిలోని కొర్లగుంటలోని డిబిఆర్ మల్టీ స్పెషాలిటీ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో మహాయజ్ఞం, శ్రీమద్ భగవత్ కథాకార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ శాంతి, మానవాళి సంక్షేమం కోసం దేశం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు మహోత్సవంలో చేరనున్నారు తెలిపారు. భగవాన్ వేంకటేష్, భగవాన్ జానకీవల్లభ్‌జీ మహారాజ్, దాసహనుమాంజీ మహారాజ్, పూర్వ ఆచార్యులందరి గొప్ప ఆశీర్వాదంతో ఝులారియా పీఠం పురుషోత్తమ మాసమహోత్సవం ఆగస్టు 3 నుండి 9 వరకు తిరుపతి ధామ్‌లో జగద్గురువులు శ్రీ రామానుజ వారి ఆధ్వర్యంలో జరుగుతుంది. లక్ష్మీ వెంకటేష్ భగవాన్ విగ్రహం మహోత్సవం కోసం మహారాష్ట్రలోని పంఢర్‌పూర్ నుండి రోడ్డు మార్గంలో వచ్చిందని తెలిపారు. ఈ మహోత్సవం కింద ఆగస్టు 3 నుంచి 9 వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. కల్ కోర్డినేటర్ కుప్పాల గిరిధర్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎస్వీయూలో మాస్టర్‌ప్లాన్ రోడ్డు వద్దు..

**'గ్రీవెన్స్‌సెల్'లో ప్రజల ఫిర్యాదు**

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్వీ యూనివర్శిటిలో మాస్టర్‌ప్లాన్ రోడ్డు వేయరాదని కోరుతు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో ఫిర్యాదులు చేశారు. ఎస్వీయు వాతావరణం భంగం కలిగించే విధంగా రోడ్డు పనులు చేయవద్దని సూచించారు. ఇందులో వివిధ రాజకీయపార్టీ నాయకులు కూడా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సిపిఎం, సిపిఐ, టిడిపి, బిజెపి, జనసేన, బిఆర్ఎస్, ఆర్‌పిఐ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

## గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలివ్వాలి

**ప్రజాశక్తి - సత్యవేడు:** గ్రీన్ అంబాసిడర్‌కు పెండింగ్ జీతాలివ్వాలని.. సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శేఖర్, సుబ్రహ్మణ్యం, గౌతమ్, బాలయ్య, కుమార్, మునస్వామి, రామయ్య, గిరి , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విజయభాస్కర్‌రెడ్డికి పరామర్శ

**ప్రజాశక్తి-నాయుడుపేట:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిని సోమవారం నాయుడుపేటలోని ఆయన నివాసంలో టీఎంఆర్ గ్రూప్స్ అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి పరామర్శించారు. విజయ్‌భాస్కర్‌రెడ్డి తండ్రి సిద్ధారెడ్డి ఇటీవల కన్నుమూసిన విషయం తెలుసుకున్న మోహన్ రెడ్డి స్థానిక వైసీపీ నాయకులతో కలిసి సిద్ధారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయభాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనవెంట నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు బైనా మల్లికార్జున్ రెడ్డి, పిండుకూరు మధుసూదన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కందల కష్ణారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నాన్న బాల సుబ్బారావు, ఉగ్గుమూడి భాస్కర్ రెడ్డి, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.35 లక్షల నిధులతో సీసీ రోడ్డు పూర్తి

**ప్రజాశక్తి-పాకాల:** పాకాలలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో నాలుగు దశాబ్దాల కల సాకారమైంది. రూ.35 లక్షల నిధులతో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన్ను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో మరో రూ.35 లక్షల నిధులతో ఆర్చి, ప్రహరీ, మరుగుదొడ్ల కల్పనకు చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజ బాబురెడ్డి, సర్పంచ్ కస్తూరి, ఏఎంసీ ఛైర్మన్ మునీర్, ఈశ్వర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మమ్మకండిగ్రలో 'మహాశక్తి'

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగలో సోమవారం నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు భవిష్యత్తుకు గ్యారంటీ-మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ల లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి కింద ఒక్కో స్త్రీకి నెలకు రూ.1500, దీపం పథకంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందించనుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జానా వెంకటయ్య, మండల సీనియర్ నాయకులు భాస్కర్‌నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయ నాయుడు, ప్రధాన కార్యదర్శి హేమావతి, నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి నాగరత్న, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రజిని, మండల తెలుగు మహిళా మండల అధ్యక్షురాల్లు గురు భూషణమ్మ, ధనలక్ష్మి, అమ్ములమ్మ, మురళీరెడ్డి, ధనుంజయ యాదవ్, నడిపి నాయుడు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-గూడూరు రూరల్:** గూడూరు రూరల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని గూడూరు ఎంపీపీ గురవయ్య అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గూడూరు మండలం మంగళపూరు గ్రామంలోని సివిల్ విషయంలో రూరల్ ఎస్ఐ జోక్యం చేసుకొని అత్యుత్సాహం ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదని.. దళిత ఎంపీపీ అని చూడకుండా తనను అవమానకరంగా మాట్లాడారని వాపోయారు. వైసీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ దళితులపై చూపుతున్న వివక్ష రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. ఎస్ఐ ఇద్దరు కానిస్టేబుళ్లను ఏజెంట్‌లుగా పెట్టుకొని చేస్తున్న వ్యవహారాలను త్వరలోనే ప్రజలకు తెలియజేస్తామన్నారు. దళిత ఎంపీపీని అవమానంగా మాట్లాడిన రూరల్ ఎస్ఐ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. వైస్ ఎంపీపీ మానం ఇంద్రాణి, శ్రీనివాసులు రెడ్డి, కొట్టు గోవర్ధన్, కొట్టు అశోక్, రమణారెడ్డి, ఫణీంద్ర రెడ్డి, దయాకర్, సతీష్, అబ్దుల్లా, సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** స్పందనలో వచ్చిన అర్జీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని.. పుత్తూరు తహశీల్దారు పరమేశ్వరస్వామి సూచించారు. సోమవారం ఆయన వీఆర్వోలతో సమీక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలకు పరిష్కారం చూపాన్నారు. సమావేశంలో సర్వేయర్ శేషమరాజు, డీటీ స్వరూపరాణి పాల్గొన్నారు.

## మణిపూర్ సంఘటనపై ర్యాలీ

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** మణిపూర్‌లో జరిగిన సంఘటనపై సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో క్రీస్తు సంఘ పాస్టర్ సురేష్‌బాబు, సభ్యులు దేవకుమార్, జోసఫ్, బి.సి సురేష్, ప్రేం రాజ్, వినోద్ పాల్గొన్నారు.

## ఘనంగా బంగారమ్మ తిరునాళ్ల

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్:** మండలంలోని నారాయణపురం పంచాయతీ ముళ్లపూడి ఎస్టీ కాలనీలో సోమవారం బంగారమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి పూజలు చేపట్టారు. రాచగున్నేరి పంచాయతీ మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథంనాయుడు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# యూనివర్సిటీ పరిరక్షణకు ఉద్యమిద్దాం..!

## - విద్యార్థి యువజన సంఘాలు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల కాలంలో అధికార పక్ష నేతలు విద్యార్థులకు, విద్యాసంస్థలకు భంగం కలిగించే విధంగా అడ్డదిడ్డంగా రోడ్లు వేయడంపై సోమవారం అఖిలపక్ష విద్యార్థి, యువజన, సంఘాల నేతల ఆధ్వర్యంలో అన్నమయ్య భవనం ఎదుట రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ నేతలు మాట్లాడుతూ యూనివర్సిటీ పరిరక్షణ కోసం ఎంతటి ఉద్యమాలైనా చేయడానికి సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని నాశనం చేసే విధంగా రోడ్లను విస్తరించడంపై తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రస్థాయిలో కాని, దేశస్థాయిలో గాని దీనిపైన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే యూనివర్సిటీలో ఎన్నో రకాల దొంగతనాలు జరిగాయని, విద్యార్థులు సెల్ ఫోన్లు మాట్లాడుతుండగానే సెల్ ఫోన్లు దొంగతనం జరుగుతున్నా ఉన్నతాధికారులు చూస్తూ ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు ఎవరికీ కూడా భద్రత లేదని, భద్రత పూర్తిస్థాయిలో యూనివర్సిటీలో అడుగంటి పోయిందని ఆక్షేపించారు. బుధవారం ఎస్ వి యు పరిపాలన భవనాన్ని ముట్టడి కార్యక్రమాన్ని తీర్మానించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నేతలు రామకృష్ణనాయుడు, కొట్టే హేమంత్ రాయల్, పత్తిపాటి వివేక్, రామ్మోహన్, ఆనంద్ గౌడ్, మహేంద్ర నాయక్, అక్కులప్ప, మాధవ్ కష్ణ, నాదముని, విశ్వనాథ్, అమత తేజ, మల్లికార్జున, హేమాద్రి యాదవ్, ఆది, నగేష్, నాగేశ్వరరావు, మహేంద్ర, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** రాజీవ్ నగర్ లో బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడికి జనసేన నియోజకవర్గ ఇంచార్జి వినుత కోటా సోమవారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వినుత రాజీవ్ నగర్ పర్యటన వెళ్ళినప్పుడు మైనారిటీ మహిళ పర్వీన్ తన కుమారుడి వ్యాధి గురించి తెలియజేశారు. ఆ బాలుడి వైద్య ఖర్చుల కోసం తనవంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు.

## యువత సమర్థవంతమైన పాత్ర పోషించాలి

**ప్రజాశక్తి-క్యాంపస్:** యువత సమర్థవంతమైన పాత్ర పోషించాలని ఎస్వీయూ వీసీ ఆచార్య రాజారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన "జీ20 యూనివర్సిటీ కనెక్ట్" (ఎంగేజింగ్ యూత్ మైండ్స్) సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 850 మిలియన్ల యువత తమ సహకారాన్ని పెంచుకోవడంతో దేశ నిర్మాణానికి తమ శక్తియుక్తులను అందిస్తుందన్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి, రాయబారి ముక్తేష్ కె.పరదేశి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల మధ్య పరస్పర సహకారానికి జి-20 వేదికను కల్పిస్తోందన్నారు. జి-20 యూనివర్శిటీ కనెక్ట్ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్రహ్మణ్యం రాజు, జీ20 కోఆర్డినేటర్ ఆచార్య జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** వచ్చేనెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ పేర్కొన్నారు. సీఐలు, ఎస్సైలతో పుత్తూరు కోర్టు ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించారు. క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. సీఐ లక్ష్మీనారాయణ, దస్తగిరి, సురేష్ కుమార్, సెబ్ ఎస్సై నాగరాజు, షేక్ వల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరహక్కులపై అవగాహన తప్పనిసరి

**బుచ్చినాయుడుకండ్రిగ-ప్రజాశక్తి :** గిరిజనులు పౌరహక్కులపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని తహశీల్దారు ఆర్ఐ వెంకట సుబ్బయ్య సూచించారు. సోమవారం మొక్కలచేను గిరిజన కాలనీలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సచివాలయంలో అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు తమకు రేషన్ కార్డులు, ఇంటిస్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏవో త్రివిక్రమ రావు, డిప్యూటీ తహశీల్దారు శివయ్య, సర్పంచ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీనివాసుని జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-రేణిగుంట:** రేణిగుంట పట్టణంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో కేక్ కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అందరికీ ఇంటి స్థలాలు అందించాలి

**ప్రజాశక్తి-కోట:** అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి తహశీల్దారు పద్మావతికి వినతిపత్రాన్ని అందించారు. గతంలో 82 మందికి నివేశ స్థలాలను మంజూరు చేశారని.. రీసర్వే చేసి అర్హులైన వారికి స్థలాలను ఇప్పించాలని కోరారు.

## పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డిజి డాక్టరు ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో లీగల్ మెట్రోలజీ అధికారుల బృందం తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో పలు పెట్రోల్ బంకుల్లో తనిఖీ చేశారు. నగరి, పచ్చికాపల్లలో రెండు పెట్రోల్ బంకుల్లో తక్కువ కొలతలతో విక్రయిస్తున్నందున స్టాప్‌సేల్ ఆర్డర్స్‌ను ఇచ్చారు. కె.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇకపై తరచుగా ఇటువంటి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని, ఇందుకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

## ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**పజాశక్తి- తిరుపతి సిటీ:** వైసీపీ నాయకులు బీసీలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదని, సీఎం జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను టిడిపి తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. స్థానిక బాలాజీ కాలనీలోని పూలేవిగ్రహం ఎదుట సోమవారం టిడిపి బీసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రుద్రకోటి సదాశివ మాట్లాడుతూ బీసీలకు టిడిపి హయంలోనే గౌరవం దక్కిందని, బీసీలను అభివద్ధి పరిచింది టిడిపి అని తెలిపారు. రాష్ట్రంలో పల్లె చోట్ల బీసీలపై దాడులు అధికమయ్యాయని ఇదేమని ప్రశ్నించిన పాపానికి, వైసీపీ వాళ్లు దాడులు చేస్తున్నారన్నారు. వైసీపీ ఆగడాల నుంచి తమను రక్షించాలని టిడిపిని ఆశ్రయించిన బాధితులను రాష్ట్ర మంత్రి జోగి రమేష్, దేవినేని తదితరులు హేలనుగా మాట్లాడడం శోచనీయమన్నారు. బీసిలను కించపరిచిన వైసిపికి రాబోవు రోజుల్లో ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెప్తారని ఆచరించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో దంపూర్ భాస్కర్, పుష్పావతి, చినబాబు, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్యులు గణపతి భట్‌కు సాధకశ్రీ సన్మానం

**ప్రజాశక్తి-క్యాంపస్:** రాష్ట్రీయ సంస్కత విశ్వవిద్యాలయం అద్వైత వేదాంత విభాగం ఆచార్యులు గణపతి భట్ కు సాధకశ్రీ సన్మానం చేశారు. కర్ణాటకలోని ప్రాచీన మఠాలలో ఒకటైన హరిహరపుర క్షేత్రం శ్రీ ఆదిశంకరాచార్య శారద లక్ష్మీ నరసింహ పీఠం పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి వారు దివ్య అనుగ్రహంతో తమ చాతుర్మాస్య దీక్ష సందర్భంగా 30 జూలై 23వ తేదీ బెంగళూరులో జరిగిన విద్వత్ సభలో తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కత విశ్వవిద్యాలయం ఆచార్యులు, వేద వేదాంగ విద్వాంసులు ఆచార్య గణపతి భట్టు గారిని "సాధక శ్రీ 2023" అనే బిరుదుతో సత్కరించారు. గణపతి భట్ మాట్లాడుతూ ఇది ఒక గొప్ప అరుదైన సత్కారం, జగద్గురువుల అమత హస్తాలతో సత్కారాన్ని పొందడం చాలా ఆనందాన్ని కలిగించే విషయం అని చెప్పారు.

## సంక్షేమ పథకాలతోనే ప్రజలు సంతృప్తి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** పార్టీలకతీతంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, సంక్షేమ పథకాలు పొందిన ప్రజలు సంతృప్తిగా ఉండటం చూస్తున్నామని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అన్నారు. సోమవారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామ పంచాయతీలో గడపగడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజలకు అభివృద్ధితోపాటు ఓ కుటుంబ సభ్యుడిగా కష్టనష్టాల్లోనూ, ప్రకృతి వైపరీత్యాలలోనూ ముందుండి సాయం చేశారన్నారు. మంగళం ప్రాంతం సమగ్రాభివృద్ధికి చెవిరెడ్డి కట్టుబడి ఉన్నారని, 2024 ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అఖండ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ప్రజలకు చెవిరెడ్డి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ నాగభూషణమ్మ, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల దుస్థితిపై జనసేన పార్టీ చేసిన డిజిటల్ క్యాంపెయిన్ లో వెలుగు చూసిన వాస్తవాలనైన ముఖ్యమంత్రి పరిగణలోకి తీసుకొని బాగు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కనీస వసతులు లేక లబ్ధిదారులు ఇళ్ల స్థలాల వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తేలికపాటి వర్షాలు కురిసినా ఆ ప్రాంతం చెరువులను తలపించేలా ఉందన్నారు. డిజిటల్ క్యాంపెయిన్ కార్యక్రమానికి సహకారం అందించిన జనసేన పార్టీ నాయకులను అభినందిస్తున్నానని తెలిపారు.

## ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'

**ప్రజాశక్తి-పిచ్చాటూరు:** ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి 5 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పోటీలు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు దశల్లో జరుగుతాయని తెలిపారు. పోటీల్లో 17 ఏళ్లు నిండిన పురుషులు, స్త్రీలు పాల్గొనవచ్చన్నారు. పోటీలను నిర్వహించేందుకు అవసరమైన మైదానాలు, క్రికెట్ పోటీలకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని శాప్ విజయవాడ వారు ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్, ఎంఈవో-2 యుగంధర్‌రాజు, వైసీపీ మండల కన్వీనర్ కె.టి హరిశ్చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

**ప్రజాశక్తి-తిరుచానూరు:** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లను తిరుచానూరు పోలీసులు తనపల్లి క్రాస్ వద్ద ఆదివారం అరెస్టు చేశారు. రూరల్ తహశీల్దార్ టీవి సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు.. పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు 2 కేజీల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన ఇద్దరూ తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. వీరిలో దివిన్ సెల్వరాజ్ తిరుపతి లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను తనుష్ క్రిషనన్ అనే మిత్రుడి సహకారంతో విచ్చలవిడిగా గంజాయి సరఫరా చేస్తూ యువతను మత్తు పదార్థాలకు బానిస చేశారని తిరుచానూరు సిఐ శివప్రసాద్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు.

## ముగిసిన జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** తిరుపతిలో జరుగుతున్న అండర్-19 ఆంధ్రప్రదేశ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్-2023 పోటీలు సోమవారం ముగిశాయి. స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ ప్రతి జిల్లా నుంచి మెరికలను వెలికి తీసి, జోనల్ స్థాయిలో, జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని ఉన్నతంగా నిలపాలనే ఉద్దేశంతో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకమచౌదరి, చిత్తూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణను అభినందించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్-2023 టోర్నమెంట్ విజేతలు, ద్వితీయ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకమ చౌదరి, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కమిటీ ఏర్పాటు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కన్నయ్య, గౌరవాధ్యక్షులుగా పిల్లారి బత్తినయ్య, పూల ఆనంద్, చిట్టేటి చిన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ గా వై వెంకట రమణయ్య, ఉపాధ్యక్షులుగా ఆర్ సుబ్రహ్మణ్యం, సుధాకర్, ఎస్ అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా అల్లిపూడి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా బొజ్జ గోవింద్ స్వామి, మహిళా అధ్యక్షురాలిగా ఏ నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా నరేంద్ర, బి అయ్యప్ప, రాజా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీష్, సురేంద్ర, ఏ హేమ భూషణ్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకట కష్ణయ్య, సభ్యులుగా శ్రీనివాసులు, వేణుగోపాల్, లీగల్ అడ్వైజర్లుగా శేఖర్, గురవయ్య, గౌరవ సలహాదారులుగా టి కోటేశ్వరరావు, రాజేంద్ర, భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా జి రాజేంద్ర, దేశయ్య, కే వెంకట సుబ్రహ్మణ్యం, తులసీరామ్, అయినూరు శివ, బి సుబ్రహ్మణ్యం, తిరుపాల్ పురుషోత్తంలను నియమిస్తూ ముదిరాజ్ సంఘ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షులు వల్లమ్మ కన్నయ్య మాట్లాడుతూ రానున్న కాలంలో ముదిరాజ్ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని ముదిరాజ్‌లను రాజ్యాధికారం వైపు నడిపిస్తానని చెప్పారు.

## బాలల అక్రమ రవాణా నిర్మూలిద్దాం..!

**ప్రజాశక్తి-ఏర్పేడు:** మండలంలోని ప్రగతి భవనంలో ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై )సంస్థ బెంగళూరు వారి సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పేడు మండల అభివృద్ధి అధికారి గిడ్డయ్య మాట్లాడుతూ అక్రమ రవాణా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రగతి డైరెక్టర్ కె.వి రమణ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా ఉన్న వారిని చూసినట్లయితే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ -100, దిశా హెల్ప్‌లైన్-1056, చైల్డ్ హెల్ప్ లైన్-1098 తెలపాలన్నారు. పోలీసు అధికారి జయ శంకర, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సురేష్ బాబు, ఏపీఎం పళని కుమార్, ఉపాధ్యాయులు, శాఖల అధికారులు, ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

## బాబురావుకు మాతృ వియోగం



**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** గూడూరు ముఠా యూనియన్ అధ్యక్షులు బాబురావు తల్లి మస్తానమ్మ (85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సీపీఎం, సి.ఐ.టి.యు, కె.వి.పి.ఎస్, ముఠా యూనియన్ నాయకులు ఆమె పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి గోపినాథ్, సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి సురేష్, కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు

**ప్రజాశక్తి-గూడూరు:** నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ సూర్య నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం ద్విచక్ర వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. తప్పనిసరిగా సరైన పత్రాలు కలిగి ఉండాలని, లైసెన్స్ వెంటపెట్టుకోవాలని.. హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.